ఇండోర్ స్టేడియంలో ఆటంకాలు..!


జనరేటర్ల రిపేర్ల కోసం ఏర్పాటు చేసుకున్న సామగ్రి


యలమంచిలి ఇండోర్ స్టేడియం ఆవరణలో ఉంచిన జనరేటర్లు


స్టేడియం ఆవరణలో పెరిగిన తుప్పలు

- జనరేటర్ల గ్యారేజీగా స్టేడియం పరిసరాలు
- నెలనెలా అనధికారికంగా అద్దె వసూలు
- ఆవరణలో ఏపుగా పెరిగిన తుప్పలు, ముళ్ల పొదలు
- స్టేడియం నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం

యలమంచిలి రూరల్: పట్టణంలో క్రీడాకారుల సౌకర్యార్థం నిర్మించిన యలమంచిలి ఇండోర్ స్టేడియం అధికారుల పర్యవేక్షణ లోపించడం, నిర్లక్ష్యం కారణంగా అలంకారప్రాయంగా మారుతోంది. వివిధ రకాల క్రీడలు ఆడుకునేందుకు వీలుగా సుమారు రూ.3 కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన ఈ స్టేడియంలో కొద్ది మంది క్రీడాకారులు మాత్రమే షటిల్ బ్యాడ్మింటన్ స్లాట్లు నమోదు చేసుకుని ఆడుతున్నారు. నిర్వహణ గాలికొదిలేయడంతో మిగతా క్రీడలు, వాటి సామగ్రి అటకెక్కాయి. స్టేడియం భవనం స్లాబుపై మొక్కలు పెరుగుతున్నాయి. ఆవరణలో తుప్పలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ స్టేడియాన్ని పర్యవేక్షిస్తున్న శిక్షకుడు నిర్లక్ష్యం కారణంగా కొందరు స్థానికులు స్టేడియం ఆవరణలో చెత్త, జంతువుల కళేబరాలు, ఇతర వ్యర్థాలు పడేస్తున్నారు. విపరీతమైన దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని సమీప నివాస గృహాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాభివృద్ధి శాఖాధికారులు నిర్లక్ష్యం వీడి ఇండోర్ స్టేడియం నిర్వహణపై శ్రద్ధ పెట్టి పూర్తిస్థాయిలో క్రీడాకారులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తేవాల్సి ఉంది.

ఆరు కోర్టులు.. నిర్వహణ గాలికి

యలమంచిలి ఇండోర్ స్టేడియంలో 6 కోర్టులు ఏర్పాటు చేశారు. వివిధ రకాల క్రీడలు ఆడుకోవడానికి వీలుగా గతంలో దశలవారీగా క్రీడా సామగ్రి సమకూర్చారు. పర్యవేక్షణ లోపంతో క్రీడా


స్టేడియం స్లాబుపై పెరిగిన మొక్కలు

పరికరాల్లో చాలా వరకు నిరుపయోగంగా మారడం, కొన్ని మాయమవడం జరిగాయి. దీంతో ఇక్కడ క్రీడా పోటీలు జరగడం లేదు. క్రమంగా స్టేడియానికి వచ్చే క్రీడాకారుల సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది. సభ్యులను చేర్చుకుని నెలనెలా రుసుం వసూలు చేసి వచ్చే ఆదాయంతో చక్కగా నిర్వహణ చూడాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ముఖ్యంగా నిర్వహణ కొరవడడంతో అత్యంత ఖరీదుతో చేపట్టిన ఉడెన్ ఫ్లోర్ దెబ్బతింటోంది. సాధన చేస్తున్న క్రీడాకారులకు కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదు. ప్రస్తుతం కొంతమంది క్రీడాకారులు ఉదయం, సాయంత్రం షటిల్ బ్యాడ్మింటన్ సాధన చేస్తున్నారు. అయితే సాధన చేస్తున్న క్రీడాకారుల వద్ద నుంచి వసూలు చేస్తున్న రుసుంకు సంబంధించి లెక్కలో తేడాలున్నట్టు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ అటకెక్కడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియం క్రీడాకారులు లేక వెలవెలబోతుండగా, పట్టణంలో ప్రైవేటు స్టేడియాలు క్రీడాకారులతో కళకళలాడుతుండడం గమనార్హం.

అక్రమాలపై విచారణ జరపాలి



క్రీడాకారుల సౌకర్యార్థం యలమంచిలిలో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. స్టేడియం ఆవరణలో ఎప్పుడు చూసినా జనరేటర్లే కనిపిస్తున్నాయి.. తప్ప క్రీడాకారులు కనిపించడంలేదు. జనరేటర్లు ఉంచడానికి అద్దెకివ్వడం, ఇప్పటి వరకు ఎంత అద్దె వసూలు చేశారు? ఎంత మంది క్రీడాకారులు సాధన కోసం వస్తున్నారు, వారు చెల్లిస్తున్న రుసుం పక్కదోవ పడుతోందా అన్న విషయాలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– చాకలి నూకరాజు, ఆర్టీఐ కార్యకర్త, యలమంచిలి


అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఇనుప గేటు

అందరూ ఇబ్బంది పడుతున్నారు



చాలా మంది ఇక్కడే చెత్త పడేస్తున్నారు. మూటలతో వ్యర్థాలు తెచ్చి ఇష్టానుసారంగా పడేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇక్కడ రోడ్డుపై నడిచి వెళ్లలేనంతగా కంపు కొడుతోంది. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించి, స్టేడియం ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని మనవి.

– దండా నాగవరప్రసాద్, యలమంచిలి

జనరేటర్ల గ్యారేజీగా ఆవరణ

ఇండోర్ స్టేడియం ప్రస్తుతం జనరేటర్ల గ్యారేజీగా మారిపోయింది. స్టేడియం ఆవరణలో ఒకవైపు, ముందు భాగంలో పదుల సంఖ్యలో జనరేటర్లను రోజుల తరబడి ఉంచుతున్నారు. జనరేటర్ల రిపేర్లు కూడా ఇక్కడే చేసుకుంటున్నారు. జనరేటర్ల యజమానులంతా కలిసి ఇటీవల స్టేడియానికి ఒకవైపు పెద్ద ఇనుప గేటు అమర్చారు. ఇదంతా ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండానే ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్నారు. నిత్యం భారీ జనరేటర్ల రాకపోకలతో స్టేడియం ముఖద్వారం, ఆవరణ బురదమయంగా మారి అడుగుపెట్టలేని విధంగా తయారైంది. ఫలితంగా క్రీడాకారులతో కళకళలాడాల్సిన స్టేడియం లైటింగ్ సామగ్రికి నిలయంగా మారిపోయింది. జిల్లా కమిటీ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతిలేకుండా జనరేటర్లకు స్థావరంగా స్టేడియంను మార్చేశారు సంబంధిత జిల్లా అధికారులు. పైగా జనరేటర్లను ఇక్కడ నిలిపి ఉంచడానికి యజమానుల వద్ద నుంచి నెలనెలా వేలల్లో అద్దె వసూలు చేస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. గతంలో మూడేళ్లకు ఒక గుత్తేదారుకు ఇండోర్ స్టేడియం లీజుకు ఇచ్చారు. గడువుకు రెండు నెలల ముందే లీజుదారు నుంచి స్టేడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి జనరేటర్లు నిలిపి ఉంచడానికి వసూలు చేస్తున్న అద్దె సొమ్ము, షటిల్ బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న క్రీడాకారుల నుంచి వసూలు చేస్తున్న సొమ్ములో కొంత మేర పక్కదోవ పడుతున్నట్టు ఆరోపణలున్నాయి.

కంపు భరించలేకపోతున్నాం..



ఇండోర్ స్టేడియం ఆవరణలో చెత్త పేరుకుపోతోంది. చాలా మంది చనిపోయిన ఎలుకలు, పిల్లులు, కుక్కల కళేబరాలను ఇక్కడే పడేస్తున్నారు. ఆ దుర్వాసన భరించలేకపోతున్నాం. పాములు, విష కీటకాలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలతో ఉంటున్నాం. దయచేసి స్టేడియం ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నాం.

– నూరకాసుల వరలక్ష్మి, ధర్మవరం

చాలా కాలంగా జనరేటర్లు పెడుతున్నారు..

ఇండోర్ స్టేడియం ఆవరణలో జనరేటర్లు చాలా కాలంగా ఉంచుతున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ మా కార్యాలయానికి ఒకరు లేఖ ఇచ్చారు. ఆ మేరకు వారి నుంచి నెలకు రూ.8 వేలు చొప్పున అద్దె వసూలు చేస్తున్నాం. జనరేటర్లు నిలిపి ఉంచడానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి గానీ, ఉత్తర్వులు గానీ లేవు. ఎలాంటి నిధుల దుర్వినియోగం జరగలేదు.

– రమణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం


మునగపాకలో సాంబశివుని రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: మునగపాకలో బుధవారం శ్రీసాంబశివుని రాట మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వచ్చేనెల 3న జరగనున్న శూలాల మహోత్సవంలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేడుకగా రాట మహోత్సవం నిర్వహించారు. వేప చెట్టుకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజల అనంతరం రాట వేశారు. సాంబశివుని ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మాజీ సర్పంచ్ టెక్కలి రమణబాబు, పెద్దలు ఆడారి కాశీబాబు, పెంటకోట వెంకట్, టెక్కలి పరశురామ్, పిల్లి అప్పారావు, దాడి శివ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ గారా ఉషశ్రీ

పాయకరావుపేట: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పాయకరావుపేట గ్రామ సర్పంచ్ గారా ఉషశ్రీ కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అధికారులు స్పందించి పట్టణంలోని డ్రైనేజీల నుంచి మురుగునీరు నేరేళ్ల కాలువ ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, ఏపనికి వెళ్లినా సకాలంలో చేయడం లేదన్నారు. ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సేవా దృక్పథంతో పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ కె.డేవిడ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పంచాయతీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో తలపెట్టిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా వెంకన్న ఆలయ నిర్మాణానికి బుధవారం విశాఖకు చెందిన యల్లపు వెంకటరమణమూర్తి, ఉమారాణి దంపతులు రూ.1,00,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఉమేష్, సూరిశెట్టి శ్రీనివాస్, టెక్కలి కొండలరావు, జల్లేపల్లి కిష్టప్పు, ఆడారి కాశీబాబు, మళ్ల సంజీవరావు, వెలగా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా వరాహనది ప్రవాహం


జల్లూరు వద్ద వరాహనదిలో నీటి ప్రవాహం

కోటవురట్ల: ఎగువ ఏజెన్సీలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరాహనదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. చౌడువాడ శివారున వరాహ నదిలోకి సర్పానది కలియడంతో పందూరు ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. నదికి ఆవల ఉన్న గ్రామాల ప్రజలు నదిని దాటే ప్రయత్నం చేయొద్దని అధికారులు హెచ్చరించారు. పిల్లలను నదిలోకి ఈతకు వెళ్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

చురుగ్గా కాలువ పనులు


మెయిన్ రోడ్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డు సమీపంలో కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ నిధులతో తలపెట్టిన కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో కాలువ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కరించేందుకు పాలకవర్గం ముందుకొచ్చింది. దీంతో పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తయితే ఎంతో మందికి ప్రయోజకరంగా ఉంటుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు.

సవరణ జీఎస్టీపై అవగాహన కల్పించాలి

నక్కపల్లి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ విధానంపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. బుధవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో, ప్రభుత్వం జూనియర్ కళాశాల వద్ద వివిధ శాఖల సిబ్బందికి, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపులు ఏ వస్తువుపై ఎంత మేర వర్తిస్తుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సామాన్యులకు భారంగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం కొంత మేర సడలించిందన్నారు. దీనిపై అవగాహన లేకపోతే వ్యాపారస్తుల చేతిలో వినియోగదారులు మోసపోయే అవకాశం ఉందన్నారు. గతంలో ఎంత జీఎస్టీ విధించే వారు, ఇప్పుడు ఎంత విధిస్తున్నారు.. కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ ఎంత తగ్గించారు.. అనేది ఆరా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

తీయాల్సిన బాధ్యత వినియోగదారులపై ఉందన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఎంఈవో కుంచం నరేష్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రహదారులు


అధ్వానంగా తయారైన మునగపాక జగనన్న కాలనీ ప్రధాన రహదారి


బురదమయంగా వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డు

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలకు జనం నానా అవస్థలు పడుతున్నారు. మునగపాక జగనన్న కాలనీ రహదారి బురదమయంగా మారింది. కాలనీకి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. వాడ్రాపల్లి నుంచి తిమ్మరాజుపేటకు వెళ్లే రోడ్డుపై గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై ఎక్కడ చూసినా గోతులు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

యలమంచిలి రూరల్: మండలంలోని జంపపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. నాలుగు పూల్సుగా 16 టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో ఐదు జట్లు తుది పోరుకు అర్హత సాధించాయి. జంపపాలెం, కొండకర్ల, వాడ్రాపల్లి, గణపర్తి, చూచుకొండ జట్ల మధ్య తుది పోరు జరగనున్నట్టు నిర్వాహకులు కుమార్, సాయి, పవన్, స్వామి తెలిపారు. తుది పోరులో పాల్గొన్న జట్లలో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.8 వేలు, మూడో బహుమతిగా రూ.6


రసవత్తరంగా జరుగుతున్న చెడుగుడు పోటీలు

వేలు, నాలుగో బహుమతిగా రూ.4 వేలు, ఐదో బహుమతిగా రూ.3 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన ఈ పోటీలను యువకులు పెద్ద ఎత్తున తిలకించారు.

వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు

కశింకోట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జాతీయ రహదారి వెంబడి పలు గ్రామాల్లో ఆయనకు స్వాగతం పలుకుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, జి.భీమవరం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు వీటిని ఏర్పాటు చేశారు. తాళ్లపాలెం కూడలిలో పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు పోలీసులు అభ్యంతరం తెలుపుతున్నారని శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆటోల్లో ప్రజలను తరలించరాదని ఆటో కార్మికులను, పార్టీ నాయకులను పోలీసులు హెచ్చ


తాళ్లపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రించి రోడ్ షోకు జనం రాకుండా ప్రయత్నిస్తున్నారని పార్టీ శ్రేణులు తెలిపారు.


మాజీ సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయాలి

కోటవురట్ల: ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకోలేరని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. కోటవురట్లలోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాకవరపాలెం మండలంలోని మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పరిశీలించనున్న నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ జగన్ చేపట్టిన ఈ ఉద్యోమాన్ని విజయవంతం చేయాలన్నారు. జగన్ పర్యటనతో కూటమి ప్రభుత్వంలో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని, చాలా తొందరగానే బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. పేద విద్యార్థుల భవితవ్యం కోసం నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా కార్యదర్శి పెట్ల రాంబాబు, పార్టీ సీనియర్ నాయకుడు యల్లపు కుమారరాజా, సర్పంచులు అనిల్‌కుమార్, కొరుప్రోలు శివకుమార్, ఉప సర్పంచ్ గవ్వా రాధాకృష్ణ, పార్టీ నాయకులు అయ్యపురెడ్డి బాబ్జీ, తేటకాల నారాయణరావు, కొరుప్రోలు రమణ, రుత్తల గోవిందు, రొంగల వెంకటరమణ, చిటికెల రమణ, మహేష్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.


కోటవురట్లలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

ఎస్.రాయవరం: మాకవరపాలెంలో గురువారం జరగనున్న మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మధువర్మ కోరారు. ఉదయం 11 గంటలకు తాళ్లపాలెం జంక్షన్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు చేరుకోవాలన్నారు.

సంపద తయారీ కేంద్రాలను ఉపయోగించాలి


గుర్రాజుపేటలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

ఎస్.రాయవరం: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో మీనాకుమారి కోరారు. గుర్రాజుపేట, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను నిరుపయోగంగా వదిలేయడం తగదన్నారు. గుర్రాజుపేట గ్రామంలో నిర్వహణలో లేని కేంద్రాన్ని చూసి ఆమె స్థానిక సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా యలమంచిలి సెక్షన్ కొక్కిరాపల్లి, పెదపల్లి ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కొక్కిరాపల్లి, వెంకటాపురం, అత్తిలివారిచేలు, పెదపల్లి వ్యవసాయ కనెక్షన్లు, పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, చినషేకిళ్లపాలెం, పెదషేకిళ్లపాలెం, చిన కొక్కిరాపల్లి, తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ..

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం టౌన్, రూరల్ ఫీడర్‌పై ఉన్న పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ విద్యుత్ లైన్లలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపడుతున్నందున ఎస్.రాయవరం, సర్వసిద్ధి, వాతాడ ఆక్వా, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

జోరుగా మద్యం అక్రమ అమ్మకాలు

కె.కోటపాడు : గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అక్రమ అమ్మకాలు జరుగుతున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఆరోపించారు. కె.కోటపాడులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారం చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. బెల్ట్‌షాపుల్లో బాటిల్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలను తీసుకోవాలని కోరారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

నాతవరం : వన్యప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందని నాతవరం మండల అటవీశాఖ సెక్షన్ అధికారి చిరంజీవి అన్నారు. మండలంలో బుధవారం కృష్ణాపురం అగ్రహారం, కె.వి.శరభవరం గ్రామాల్లో అటవీశాఖ అధికారులు అడవులతో పాటు వన్యపాణులకు కాపాడాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పలు గ్రామాల్లో వన్యప్రాణుల రక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో సంచరించే వన్యప్రాణులకు వేటాడడం చటంటరిత్యానేరమన్నారు. వన్యప్రాణులతో పాటు అడవులను కాపాడేందుకు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వెదురుపల్లి, పెదిమికొండ అటవీ బీట్ ఆఫీసర్లు నాగరాజు, మహంతి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి